www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 25 ఆగస్టు 2025 | 5 | చిత్తూరు



# నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్**

ఈనెల 25వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 7వ తేదీ సోమవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

**పోలీసుశాఖలో..**

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) 25వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు పాత డిపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు.

### పంచాయతీ కార్మికులకు
# కనీస వేతనాలు అమలు చేయాలి
### 10వ జిల్లా మహాసభలో వక్తలు డిమాండ్



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు

**ప్రజాశక్తి- వి కోట**

చిత్తూరు జిల్లా పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ 10వ జిల్లా మహాసభలు ఆదివారం వీకోటలోని ఓ కళ్యాణ మండపంలో జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రామయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు హాజరై మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను వ్యతిరేకించాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేసి, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వస్తే పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఒక సమస్య కూడా పరిష్కారం చేయకపోవడం దారుణమన్నారు. పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా పంచాయతీ కార్మికుల సమస్యల ఎలా పరిష్కారం అవుతాయని అన్నారు. స్థానికంగా ఆదాయం లేదనే సాకుతో పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. ఉమ్మడి జిల్లాలో పంచాయతీ కార్మికులు పెద్దఎత్తున పోరాటం చేసి అధికారుల మెడలో వంచి కొన్ని సమస్యలను పరిష్కారానికి ప్రయత్నం చేస్తే ఆ సమస్యలు కూడా ఇప్పటివరకు పరిష్కారం చేయలేదని, ఇప్పటికైనా కోర్టు ఆదేశాలను అమలు చేసి అన్ని పంచాయతీల్లో వేతనాలు పెంచాలన్నారు. పంచాయతీ కార్మికుల ఐక్యంగా పోరాడి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనేక చోట్ల ప్రజాప్రతినిధులు బెదిరిస్తున్నారని కోర్టు ఆర్డర్స్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలు యూనియన్ జిల్లా అధ్యక్షుడు మధు అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగభూషణం రాము, జిల్లా నాయకులు మల్లయ్య, వెంకటముని పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ వాయిదా: కడా పీడీ

**ప్రజాశక్తి- కుప్పం:** కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం 25వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు కడా పీడీ వికాస్ మర్మత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాలవల్ల ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగిందని వచ్చే సోమవారం యథావిధిగా పిజిఆర్ఎస్‌ను నిర్వహించనున్నట్లు పీడీ తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కు 12వ పిఆర్‌సి కమిటీ ఏర్పాటు చేయాలి
# ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలి
### యుటిఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్‌లో వక్తలు



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు

**ప్రజాశక్తి- యాదమరి:** పిఆర్‌సిని అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వర రావు డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్ నాయుడు అధ్యక్షతన ఆదివారం యాదమరిలో జరిగిన జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లిస్తామని, పీఆర్సీని వెంటనే అమలు చేస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పటికి సంవత్సరం గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల పూర్తిగా నిర్లక్ష్య ధోరణితో ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ వారిని పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించుకోబోమని ఒకవైపు చెబుతూనే మరొక వైపు రకరకాల యాప్‌లతో, వివిధ రకాల శిక్షణలు, ఫార్మేటివ్ అసెస్మెంట్ పుస్తకాలను ఉపాధ్యాయులే పూరించాలనడం ఇతరత్రా కార్యక్రమాలతో ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురి చేస్తోందన్నారు. ఉపాధ్యాయ బదిలీలు ముగిసినప్పటికీ రిలీవర్ లేక ఎక్కడి వాళ్లు అక్కడే ఆగిపోవడంతో ఉపాధ్యాయుల్లో నిరాశ, ఆందోళన నెలకొందన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయుటకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. డీఎస్సీ ఉపాధ్యాయుల నియామకం తర్వాత బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చెయ్యాలనుకుంటే డీఎస్సీ ఉపాధ్యాయుల సంఖ్యను పెంచితే తప్ప సాధ్యం కాదన్నారు. ఈ సమస్యలు పరిష్కరించుటకు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణ చేసి పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం అనంతరం యాదమరి ఎంఈవో రుక్మిణిను, ఎంఈవో 2 ప్రసాద్‌ను శాలువ కల్పి జ్ఞాపికను అందించి సత్కరించారు. అలాగే టీచర్స్ పాతపెన్షన్ సాధన కోసం మహాధర్నా పోస్టర్‌ను యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు జీవి.రమణ, ఎస్ఎస్.నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మణి గండన్, జిల్లా గౌరవ అధ్యక్షులు పి.సుధాకర్ రెడ్డి, జిల్లా సహాధ్యక్షులు ఎస్.రెహానా బేగం, కోశాధికారి కె.ప్రసన్నకుమార్, నాయకులు పి.సురేష్, ఎస్‌పి.బాషా, పిఆర్.మునిరత్నం, సదాశివరెడ్డి, సీపీ.ప్రకాష్, దక్షిణమూర్తి, డి.ఏకాంబరం పాల్గొన్నారు.







ఎంఈవో రుక్మిణి, ఎంఈవో 2 ప్రసాద్‌ను సన్మానిస్తున్న సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

**ఇంటర్వ్యూ**

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి**



**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఫ్రైడే డ్రైడే పాటించడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టడంతో పాటు విషజర్వాల నుండీ మనల్ని మనం కాపాడుకోవచ్చని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుధారాణి తెలిపారు. జిల్లాలోని అన్ని పిహెచ్‌సి, సిహెసీల్లో అసరమైన మందులను అందుబాటులో ఉంచడంతో పాటు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవసరమైన సూచనలు అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేడి పదార్థాలను తీసుకోవడం, సురక్షితమైన తాగునీటి తీసుకోవడం వల్ల సీజనల్ వ్యాధులను దూరం వేయవచ్చన్నారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలోఆమె మాట్లాడారు.

**ప్రజాశక్తి :** జిల్లాలో సీజనల్ వ్యాధులు సోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు..?

**డిఎం అండ్‌హెచ్‌ఒ:** జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా అసుత్రుల్లో డెంగీ అనుమానిత లక్షణాలున్న వారికి ర్యాపిడ్ కిట్‌తో పరీక్ష నిర్వహిస్తున్నాం. ఇందులో పాజిటివ్ వస్తే ఆ నమూనాలను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపుతున్నారు.

**ప్రజాశక్తి:** దోమల నివారణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

**డిఎం అండ్‌హెచ్‌ఒ:** పరిసరాల్లో మురుగునీటి నిల్వలు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇవే సీజనల్ వ్యాధులకు కారణం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం డెంగీ నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుంది. ప్రతి శుక్రవారం ఫ్రైడేడ్రైడే నిర్వహించడంతో పాటు ఏఎన్ఎం, ఆశాలు ఇంటింకీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు.

**ప్రజాశక్తి:** ప్లేట్‌లెట్లు తగ్గడం అంటే ఏమిటి..?

**డిఎం అండ్‌హెచ్‌ఒ:** సాధారణంగా ఆరోగ్యంగా ఉన్న మనిషి రక్తంలో లక్షన్నరకు పైగా ప్లేట్‌లెస్స్ ఉండాలి. డెంగీ సోకిన వారిలో ఇవి గణనీయంగా తగ్గుతాయి. 30వేల కన్నా తక్కువ ఉంటే వెంటనే ప్లేట్‌లెస్స్‌ను ఎక్కించాల్సి ఉంటుంది. డెంగీ వ్యాధికి గురైన వారి కోసం అవసరమైన రక్తం అందుబాటులో ఉంది.

**ప్రజాశక్తి :** జిల్లాలో ప్రభుత్వ ఆసుత్రులు ఎన్ని...?

**డిఎం అండ్‌హెచ్‌ఒ:** చిత్తూరు జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 50, 24/7 ఆరోగ్య కేంద్రాలు 20, నాన్ 24/7 ఆరోగ్య కేంద్రాలు 30, సబ్ సెంటర్లు 613, సామాజిక ఆరోగ్య కేంద్రాలు 7, ప్రాతీయ వైద్యశాలలు 7, ప్రాంతీయ వైద్యశాలలు 3, జిల్లా అసుపత్రి 01, వైద్యకళాశాలలు 3. నవజాత శిశు సంరక్ష కేంద్రం 1, పట్టణ ఆరోగ్య కేంద్రాలు 14, రక్తనిధి కేంద్రాలు 2 ఉన్నాయి.

**ప్రజాశక్తి:** వ్యాధినిరోధక టీకాలు జిల్లాలో ఎంతమందికి వేశారు.....?

**డిఎం అండ్‌హెచ్‌ఒ:** ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వ్యాధినిరోధక టీకాలు అందించడం జరిగింది. జిల్లాలో బిసీజి, ఒ డోస్, పెంటావెలంట్ వేయడం జరిగింది. డెంగి వ్యాధి వల్ల జిల్లాలో 30 మరణాలు సంభవించాయి.

# కుప్పం చేరుకున్న కృష్ణా జలాలు

**- గుండి శెట్టిపల్లి వద్ద జలహారతి - ఆనందోత్సవాల్లో రైతులు**



**ప్రజాశక్తి - శాంతిపురం, రామకుప్పం:** హంద్రీ -నీవా కుప్పం బ్రాంచ్ కెనాల్ కాలువ ద్వారా కృష్ణానది జలాలు ఆదివారం కుప్పం చేరుకున్నాయి. ఆదివారం ఉదయం కుప్పం నియోజకవర్గం రామకుప్పం నుండి ప్రవేశించిన నదీ జలాలు శాంతిపురం మండలం మీదుగా కుప్పం పరమసముద్రం చెరువుకు సాయంత్రం చేరుకున్నాయి. ఈసందర్భంగా తెలుగుదేశం నాయకులు మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు పెద్దసంఖ్యలో గుండె శెట్టిపల్లి వద్ద హంద్రీనీవా కాలువలో కృష్ణానది జలాలకు జలహారతి పట్టారు. రైతులు, ప్రజలు నదీ జలాల్లో జలకాలాటలు ఆడి ఆనందంతో సంబరాలు చేసుకున్నారు. కుప్పం ప్రజల జీవనాడి హంద్రీ-నీవా కాలువ ద్వారా సాగునీరు రావడంతో రైతుల కళ్ళలో ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్.మునిరత్నం, పిఎంకె కూడా ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, మండల అధ్యక్షుడు ఉదయ్ కుమార్, గుంజార్లపల్లి సర్పంచ్ విజయరామిరెడ్డి పాల్గొన్నారు.

రామకుప్పంలోకి ప్రవేశించిన హంద్రీ-నీవా కృష్ణా నదీ జలాలకు ఆదివారం కూటమి నేతలు కర్పూర హారతులు పట్టారు. శనివారం రాత్రి వర్ధికుప్పం మీదుగా రాజుపేటకు నీరు చేరుకోవడంతో పెద్దసంఖ్యలో కూటమి నేతలు అక్కడికి చేరుకొని విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన నెల రోజులకే హంద్రీ-నీవా పనులకు గాను నిధులు కేటాయించి పనులు పునః ప్రారంభించారని, కుప్పం ప్రజలకు శాశ్వతంగా సాగు, తాగునీరు పుష్కలంగా అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశల కృషి చేశాడని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, నరసింహులు , ఆంజనేయ రెడ్డి, సీతాపతి, రామకృష్ణప్ప, గంట్ల రెడ్డి, రఫీ, రవి రెడ్డి, విశ్వనాథ్, వెంకటాచలం, వెంకటరమణ పాల్గొన్నారు.

# డ్వామా నుండి కదలం..

- డ్వామాను శాసిస్తున్న సీఓలు
- జీతాలు అక్కడ.. విధులు ఇక్కడ..
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..
- ఇదెక్కడి న్యాయమంటున్న తోటి సీఓలు..

**ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి):**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి బదిలీలలో అవకతవకలు చోటు లేకుండా న్యాయబద్ధంగా బదిలీల కౌన్సిలింగ్ కొనసాగాలని బదిలీల కౌన్సిలింగ్‌కు మార్చ్ నెలలో ప్రభుత్వం జీవో విడుదల చేసింది. జిల్లా కలెక్టర్ జిల్లాస్థాయి బదిలీలకు కౌన్సిలింగ్ కమిటీకి చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన చిత్తూరు ఉపాధి హామీ కార్యాలయంలో బదిలీలు కౌన్సిలింగ్ డ్వామా పీడీ సమక్షంలో మార్చి 19వ తేదీన చేపట్టారు. ఈ కౌన్సిలింగ్‌కు చిత్తూరు జిల్లాలోని 31 మండలాల నుండి ఉపాధి హామీ కార్యాలయాల్లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు 35 మంది వరకు హాజరయ్యారు. ఈ బదిలీల కౌన్సిలింగ్‌లో అయిన వారికి ఆకుల్లో... కాని వారి కంచాలలో అన్న చందంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. నేటికీ కౌన్సిలింగ్ జరిగి ఆరు నెలలు గడుస్తున్నా చిత్తూరు జిల్లా ఉపాధి హామీ కార్యాలయాల్లో పనిచేస్తున్న కొంతమంది సిఓలు జిల్లా డ్వామా కార్యాలయాన్ని వదలడం లేదు.


జిల్లా ఉపాధి కార్యాలయంలో పనిచేసే కొంతమంది సీఈఓలను ఒకరిని కలికిరి క్లస్టర్‌కు, మరొకరిని పుంగనూరు క్లస్టర్‌కు, పాలసముద్రం మండలంకు ఒకరిని, ఎస్ఆర్ పురం మండలంకు ఒక కంప్యూటర్ ఆపరేటర్ను బదిలీల చేశారు. బదిలీల కౌన్సిలింగ్ లో ఆ క్లస్టర్ పరిధిలోని ఉపాధి హామీ కార్యాలయాలకు జిల్లా ఉపాధి హామీ సంచాలకులు, జిల్లా రెవెన్యూ అధికారి సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారికి బదిలీ ఉత్తర్వులను ఇచ్చారు. ఇప్పటివరకు ఆరు నెలలు గడుస్తున్నా ఒక్కరోజు కూడా వారికి కేటాయించిన క్లస్టర్ పరిధిలోని ఉపాధి కార్యాలయంలో విధులు నిర్వహించిన దాఖలాలు లేవు. వారు పనులేమో ఇక్కడే చేసుకుంటూ జీతాలు అక్కడ తీసుకుంటున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కౌన్సిలింగ్లో కోరుకున్న ప్రదేశాల్లో అవకాశాల కోసం ఎదురుచూస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు ఈ బదిలీల కౌన్సిలింగ్‌లో కూడా కొంతమందికి న్యాయం జరగకపోవడంతో వారు తీవ్రఆవేదనకు గురవుతున్నారు. డ్వామా కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లు అవసరం లేకపోయినా చిత్తూరు ఎన్నిసి నుండి పైరవీలతో డ్వామా కార్యాలయానికి కొంతమంది కంప్యూటర్ ఆపరేటర్లు బదిలీలు లేకున్నా పోస్టింగ్లు తీసుకున్నారని సమాచారం.

చిత్తూరు జిల్లా ఉపాధి హామీ కార్యాలయంలో జిల్లాస్థాయి అధికారిని ప్రసన్నం చేసుకుంటే ఎన్ని ఏళ్లయినా, డ్వామాలోనే కొనసాగవచ్చు అని, కొత్తవారికి జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలోని ఉపాధి కార్యాలయంలో కంప్యూటర్‌గా విధులు చేసేందుకు తలుపులు తీయరు. బదిలీలు జరిగిన గాని ఇంతవరకు కొంతమంది సీఓ అక్కడే కొనసాగిస్తుండడంతో కౌన్సిలింగ్లో అన్యాయం జరిగిన సీవోలు ఈ విషయాన్ని చిత్తూరు జిల్లా కలెక్టర్, ఉపాధి హామీ కమీషనర్, సిఆర్డిఏకు వారికి జరిగిన అన్యాయాన్ని ఫిర్యాదు చేసేందుకు సమాయత్తమయ్యారు.

**పెద్దమండలాల్లో సీఓల కొరత..**

ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు చిత్తూరు జిల్లా ఉపాధి హామీ కార్యాలయంలో సీఓలో సగం మంది మాత్రమే విధులు నిర్వహించేవారు. తక్కువ మంది సిబ్బంది ఉన్న అప్పట్లోనే పనులు సజావుగా జరిగేవి. ఇప్పుడు ఏకంగా జిల్లా కార్యాలయంలో 12 మంది సీవోలు ఉన్నారు. అందులో కొంతమంది సీఓలకు పనులు లేకున్నా పోస్టింగులు పైరవీలతోనే అక్కడ విధులు నిర్వహిస్తున్నారు. గతంలో 66 మండలాలు ఉన్నప్పుడు ఆరు మంది సీఓలు ఉండే వారు ప్రస్తుతం 31 మండలాలు ఉండగా 12 మంది సీఓలు ఉన్నారు.

చిత్తూరు జిల్లాలో పెద్దమండలాల్లో ఉపాధి పనులు అధికంగా జరుగుతున్న మండలాల్లో ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు ఉండాల్సి ఉన్నా ఆ మండలాల్లో ఒక్కొక్కరు మాత్రమే కొనసాగుతున్నారు. అలాంటి మండలాలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో అనవసరంగా ఉన్న సిఓలను ఆ మండలాల కేటాయిస్తే పూర్తిస్థాయిలో పనులు సకాలంలో జరిగేందుకు ఎంతనో వీలుంటుంది. జిల్లా కార్యాలయంలో 12 మంది సీవోలు ఎందుకు ఉన్నారు, వారు ఏం పనులు చేస్తున్నారు. ఆ పనులకు సీఓలు అవసరమా.. ఆ కార్యాలయంలోని అధికారులకే అర్థం కావడం లేదు. చిత్తూరు జిల్లా ఉపాధి హామీ కార్యాలయంలో బదిలీల అయినా ఇంతవరకు అదే స్థానంలో ఎందుకు కొనసాగుతున్నారు. కొత్తవారికి జిల్లా ఉపాధి కార్యాలయాల్లో అవకాశాలు ఇవ్వకుంటే న్యాయపోరాటానికి నిరసనలకు సిద్ధమవుతామని బదిలీల కౌన్సిలింగ్‌లో అన్యాయం జరిగిన సిఓలు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి డ్వామా కార్యాలయంలో పనిచేస్తున్న సిఓల ప్రక్షాళన జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



జిల్లా ఉపాధి హామీ కార్యాలయంలో కౌన్సిలింగ్ హాజరైన కంప్యూటర్ ఆపరేటర్లు

# పారిశుధ్య లోపం - వ్యాధుల భయం

**ప్రజాశక్తి- విజయపురం (నగరి):**

నగరి మండలంలో పారిశుధ్యం లోపం కారణంగా ప్రజల్లో సీజనల్ వ్యాధుల భయం పట్టుకుందని నిత్యం గ్రామస్తులు అనారోగ్యం భారిన పడాల్సి వస్తోందని వారు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని మాంగాడు ఆది ఆంధ్రవాడ గ్రామంలో రోడ్లపై నిల్వ ఉన్న మురుగు నీరు అధ్వానంగా మారాయి. పారిశుధ్యం లోపం కారణంగా సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా వంటి విష జర్వాల భారిన పడుతామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రుతుపవనాల ప్రభావంతో అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. చాలా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీటితో వర్షపు నీరు చేరి రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఎక్కడిక్కడ నీరు నిల్వ చేరి దోమలకు ఆవాశాలు మారడమే కాకుండా దుర్వాసనతో గ్రామాల్లో పారిశుధ్య లోపం కొటొచ్చినట్లు కనబడుతోంది. సీజనల్ వ్యాధుల పట్ల వైద్యాధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నా పారిశుధ్య లోపం కారణంగా వ్యాధులు ప్రబలుతుండడం సమస్యగా మారుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. మూడు రోజులకు ఒకసారి ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రం చేసుకోవాలని, పాత టైర్లు, కొబ్బరి బోండాలు, పగిలిపోయిన కుండలు ఇంటి పరసరాల్లో ఉంచకుండా చూసుకోవాలని సూచించారు. వీటిల్లో నిల్వ ఉండే నీటిలో దోమలు వృద్ధి చెంది ఆ దోమల కాటుతో ప్రజలు అనారోగ్య భారినపడతారని అప్రమత్తంగా ఉండాలంటున్నారు. కానీ పారిశుధ్యం మెరుగు కోసం అధికారులు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దోమల భారిన పడకుండా ఇలా..**

ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిపై కిరోసిన్, వాహనాల్లో వాడిన ఇంజనాయిల్ వంటివి వేయాలి. ఇలా చేయడం వలన దోమలు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. తినే ఆహారంపై ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వంట పాత్రలపై మూతలు తప్పనిసరిగా ఉంచాలి. తాజా ఆహార పదార్థాలు తీసుకోవాలి. శరీరం అలసటగా ఉన్నా వ్యాధులు సోకినట్లు అని పించినా వెంటనే ఓఆర్ఎస్ ప్యాకెట్లను తీసుకుని, వైద్యులను సంప్రదించాలి.

**సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..**

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ. ఈ విషయం పట్ల గ్రామీణులు అప్రమ్తంగా ఉండాలి. కలుషిత నీటి విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. తాగే నీటిని బాగా మరిగించి చలార్చి తాగాలి. నిల్వ చేసిన పదార్థాలను తినకుండా ఆరోగ్య సూత్రాలను పాటిస్తే సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. ఇప్పటికే వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అందరినీ వైద్యాధికారులు చెబుతూ ఉంటే కూడా గ్రామాల్లో పారిశుధ్య లోపం మాత్రం కనిపిస్తూనే ఉంటోందని స్థానికులు చెప్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి వెంటనే పారిశుధ్య పనులపై దృష్టిపెట్టి తమ గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడకుండా కాపాడాలని కోరుతున్నారు.





గ్రామాల్లోని వీధుల్లో నిలిచిపోయిన మురుగు నీరు, ఇళ్ల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం


తూగుండ్రం మొరవ కట్ట తెగి వృథా పోతున్న నీరు

## మొరవ కట్టకు మరమ్మతు చేయండి

**ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు:** మండల పరిధిలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు తూ గుండ్రం చెరువు పూర్తి స్థాయిలో నిండి మొరవ పోతోంది. రెండు రోజులు కురిసిన వర్షానికి మొరవ కట్టపై భారీగా నీరు ప్రవహిస్తోంది. అయితే మొరవ కట్ట పాడైపోయి ప్రమాదంగా మారింది. తక్షణం కట్టకు మరమ్మతులు చేపట్టకపోతే పూర్తిగా పాడైపోయి చెరువు నీరంతా వృథాగా వెళ్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చెరువు మొరవకట్ట రాళ్లను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారని విమర్శలు ఉన్నాయి. సంబంధిత అధికారులు మొరవ కట్టను బాగుచేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

## 28న తెలుగు భాషోత్సవాలు

**ప్రజాశక్తి- పలమనేరు రూరల్:** గంగవరం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ ముందస్తుగా కళామందిరంలో తెలుగు భాషోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పి తులసినాథం నాయుడు, పువ్వు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగు గ్రామాల్లో నుంచి 242 మంది పిల్లలు వ్యాసాలు రాసి పంపారని వారిలో వంద మందికి బహుమతులు అందిస్తామన్నారు. 100కు పైగా పద్యాలు చెప్పగలిగే పిల్లలు 50 మంది పేర్లు నమోదు చేసుకున్నారని వారందరికీ బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు తెలుగు భాషాభిమానులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.


సమావేశంలో పాల్గొన్న వడ్డెర్ల సంఘం నాయకులు

## ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకుందాం..

### వడ్డెర్ల సంఘం పిలుపు

**ప్రజాశక్తి- కుప్పం :** వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలని వడ్డెర్ల సంఘం నేతలు పేర్కొన్నారు. కుప్పం జమీందారీ పార్కులో ఆదివారం వడ్డెర్లు సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్ బాబు, వడ్డెర రాయలసీమ జిల్లాల అధ్యక్షులు వడ్డే వెంకట్ ఆధ్వర్యంలో సెప్టెంబర్‌లో కుప్పంలో సమావేశం నిర్వహి స్తామని నియోజకవర్గం అధ్యక్షులు మాధవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ, మునిరత్నం, కృష్ణయ్య, వడ్డెర్లు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

## ఉచిత వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి-కుప్పం:** కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బిఆర్ డి హాస్పిటల్‌లో బెంగళూరుకు చెందిన బ్రెయిన్ హాస్పిటల్, ఆల్టీయస్ హాస్పిటల్ వారిచే నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేష్ తెలిపారు. హార్ట్, మీరు, ఈ ఎన్‌టి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించామని తెలిపారు. వైద్య పరీక్షకు హాజరైన వారిలో ఆరుగురికి హార్ట్ ఆపరేషన్, ముగ్గురికి ఉచిత నాడి శాస్త్ర చికిత్సకు సిఫారసు చేసినట్లు బిఆర్‌డి ఆస్పత్రి అధినేత డాక్టర్ సురేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ సుదర్శన్, సెల్వం, సెంథిల్ కుమార్, చరణ్, ప్రసాద్, డాక్టర్ కృష్ణమూర్తి, ఏకాంబరం, వీఆర్వో రాజకుమార్, మణి పాల్గొన్నారు.



## వ్యర్థాలు తొలగించండి

### - పొంచివున్న ప్రమాదం - వాహనదారుల అభ్యర్థన

**ప్రజాశక్తి -బంగారుపాళ్యం:** ప్రమాదం జరగకముందే రహదారిపై వ్యర్థాలు తొల గించాలని వాహనదారులు కోరు తున్నారు. రాగి మాను పెంట రోడ్డు కూడలిలో గృహ ఉప యోగంలో వ్యర్థాలను రహదారి పక్కలో కుప్పగా పోసి ఉంచడంపై వాహనదారులు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. పట్టించు కోవాల్సిన రోడ్డు భవనాల శాఖ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం వల్ల వ్యర్థాల కుప్పలు పేరుకుపోయి ప్రమాదకర స్థితికి చేరుకుంది. ప్రమాదాలు చోటు చేసుకోకుండా వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి ఉపయోగకరం: ఎస్‌పి

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ :** సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి ఉపయోగకరమని ఎస్‌పి మణికంఠ చందోలు పేర్కొన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చిత్తూరు గాంధీ కూడలిలో 'సండే ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని ఎస్‌పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నేటి వేగవంతమైన జీవన శైలిలో ప్రతిరోజూ మనం ఎక్కువగా ద్విచక్ర వాహనాలు, కార్లలో ప్రయాణించడం అలవాటు అయ్యింద నని, ఆధునిక సౌకర్యాలతో జీవనం సాగిస్తున్నా శారీరక చురుకుదనం లేకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆరోగ్య పరిరక్షణకు ప్రతి రోజూ 30 నిమిషాలు సైకిల్ తొక్కడం వల్ల శరీరానికి అవసరమైన వ్యాయామం లభిస్తుందన్నారు. ఇవి గుండె వ్యాధులు, ఊబకాయం, మధుమేహం వంటి అనేక రకాల సమస్యలను నివారిస్తుందన్నారు. జిమ్ కి వెళ్లడం కంటే సైక్లింగ్ మరింత సహజసిద్ధమైన వ్యాయామం అన్నారు. అనంతరం ఏఆర్ అడిషనల్ ఎస్‌పి శివానంద కిషోర్ జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఎస్‌పితో పాటు పట్టణ యువతీ యువకులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.


సైకిల్ తొక్కుతున్న ఎస్‌పి మణికంఠ చందోలు

## ఎన్‌టిఆర్ ట్రస్ట్ ప్రోత్సాహం

**ప్రజాశక్తి-కుప్పం:** ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుప్పంలో నిర్వహించిన ఉచిత డీఎస్సీ కోచింగ్ నిరుపేదలకు వరంగా మారింది. సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ప్రత్యేక చొరవతో కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా నిరుద్యోగ యువతకు డీఎస్‌సీ కోచింగ్‌కు సంబంధించి శిక్షణ ఇచ్చారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌లో శిక్షణ పొందిన 15 మందికి పైగా అభ్యర్థులు మెగా డీఎస్సీలో ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించారు. వీరిలో అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన వారు ఉండడంతో వారి కుటుంబాల్లో డీఎస్సీ ఫలితాలు వెలుగులు నింపాయి.

కుప్పం మండలం వడ్డీ గొల్లపల్లికి చెందిన తాపీ మేస్త్రి మల్లప్ప కుమారుడు శివకుమార్ మెగా డీఎస్సీలో 86.86 మార్కులతో చిత్తూరు జిల్లాలో 42 ర్యాంకు సాధించి టీచర్ ఉద్యోగం పొందాడు. కుప్పం పట్టణం నిరుపేద కుటుంబానికి చెందిన అర్జున్ కుమార్తె పూజ మెగా డీఎస్సీలో 79.6 మార్కులతో ఉద్యోగం సాధించింది. కుప్పం పట్టణం వజ్రవేలు శెట్టి వీధికి చెందిన కార్పెంటర్ సెల్వం కుమార్తె ప్రియాంక 78.18 మార్కులతో టీచరుగా ఎంపికైంది. కుప్పం మండలం గుడ్ల నాయన పల్లి కి చెందిన మీనా వ్యవసాయ కుటుంబంలో పుట్టి 88.49 మార్కులతో చిత్తూరు జిల్లాలో 16వ ర్యాంకు సాధించింది. కుప్పం

## ఉపాధ్యాయ ఉద్యోగానికి నిరుపేదలు


టీచరు ఉద్యోగాలకు ఎంపికైన పేద కుటుంబాల పిల్లలు

మండలం పెద్దగోపన్నపల్లె హైస్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యా యుడి సతీమణి లీలావతి 75.9 మార్కులు సాధించింది. గుడిపల్లి మండలం ఆగ్రామ్ గ్రామానికి చెందిన శోభ సచివాలయ ఉద్యోగ పని చేస్తూ మెగా డీఎస్సీలో 83.24 మార్కులతో టీచర్ ఉద్యోగానికి ఎంపికైంది. వీరితో పాటు కుప్పం మండలం పరమ సముద్రం గ్రామానికి చెందిన సంధ్య, శాంతిపురం మండలం మొరసనపల్లి గ్రామానికి చెందిన రేవతి, గుడిపల్లి మండలం యామిగాని పల్లికి చెందిన శ్రీనివాసులు ఇంగ్లీషు ఉపాధ్యా యులుగా ఎంపికయ్యారు. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేని పరిస్థితిలో ఉన్న తమకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అందించిన డీఎస్‌సి కోచింగ్ తమ జీవితాల్లో వెలుగులు నింపాయంటూ వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ కోచింగ్‌తో పాటు మెటీరియల్ ఉచితంగా అందించిన ఎన్టీఆర్ ట్రస్ట్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## డిఎస్‌సిలో జిల్లా టాపర్ మహమ్మద్ జిలాని

**ప్రజాశక్తి - రొంపిచర్ల :**



మెగా డీఎస్సీ ఎస్‌ఏ మ్యాథ్స్ ఉర్దూ విభాగంలో చిత్తూరు జిల్లా టాపర్ గా రొంపిచర్ల మండలానికి చెందిన మహమ్మద్ జిలాని నిలిచారు. ఎస్‌ఏ మ్యాథ్స్ ఉర్దూ విభాగంలో 67/100 (హాల్‌టికెట్ నెంబరు ఎండిఎస్‌సి 0215271), ఎస్‌ఏ మ్యాథ్స్ తెలుగు విభాగంలో 71.04780/100 మార్కులు వచ్చాయి. రొంపిచర్ల, చిన్న మసీదు వీధికి చెందిన షేక్ మునీర్ బాషా కుమారుడు మహమ్మద్ జిలాని గత 4 సంవత్సరాలుగా తమిళనాడులోని ధర్మపురిలోని సిబిఎస్‌ఇ పాఠశాలలో మ్యాథ్స్, ఐఐటి, ఫౌండేషన్ టీచర్‌గా పనిచేస్తున్నారు. అన్నమయ్య జిల్లాలో నారాయణ, రవీంద్ర భారతి కార్పొరేట్ పాఠశాలల్లో మ్యాథ్స్ ఒలింపియాడ్ టీచర్‌గా 5 సంవత్సరాలు పనిచేశారు. ఇదే క్రమంలో డీఎస్సీలో జిల్లా స్థాయి టాపర్ గా నిలిచారు. కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# క్రైం న్యూస్

## దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

**ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు:** మండలంలోని వేపంజేరి గ్రామంలో ఓ వికలాంగుడిపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దాడి చేసిన సంఘటనలో నిందితుడిని ఆదివారం అరెస్టు చేశారు. గంగాధర నెల్లూరు మండలం, వేపంజేరి గ్రామానికి చెందిన ప్రత్యేక ప్రతిభావంతుడు ఎం హరిప్రసాద్‌కు అదే గ్రామానికి చెందిన ఎం ఆనంద రెడ్డి మధ్య కొన్ని రోజులుగా డబ్బు విషయమై ఘర్షణ సాగుతోంది. ఈ నేపథ్యంలో మండలంలోని వేపంజేరిలో ప్రత్యేక ప్రతిభావంతుడు హరిప్రసాద్‌పై ఆ గ్రామానికి చెందిన ఆనంద రెడ్డి కర్రతో దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితుడు హరిప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ శ్రీనివాసంతి కేసు నమోదు చేసి, నిందితుడు ఆనంద రెడ్డిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఈ ఘటన కు వ్యక్తిగత విభేదాలే కారణమని, ఇందులో ఎలాంటి రాజకీయ సంబంధం లేదని పేర్కొన్నారు.


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

## పట్టపగలే ఎవరూ లేని ఇంట్లో చోరీ

### నగదు, బంగారం అపహరణ

**ప్రజాశక్తి - ఎస్‌ఆర్ పురం :** పట్టపగలే ఎవరూ లేని ఇంట్లో భారీగా నగదు, బంగారు చోరీకి గురైన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం ఎస్‌ఆర్‌పురం మండలం వివి పురం గ్రామ గంగమ్మ గుడి గ్రామానికి చెందిన చిట్టి బాబు నాయుడు ఇంట్లో శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులందరూ కలసి తిరుత్తణి గుడికి వెళ్లారు. చిత్తూరు పుత్తూరు రహదారికి ఆనుకొని ఉన్న గంగమ్మ గుడి గ్రామంలో అదును చూసి గుర్తు తెలియని వ్యక్తులు వారి ఇంట్లో దొంగతనం చేశారు. సుమారు 40 గ్రాముల బంగారం, కేజీ వెండి, 30 వేల రూపాయల నగదు దోచుకెళ్లారని ఇంటి యజమాని తెలిపారు. దొంగతనంపై ఎస్‌ఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేశారు. క్లూస్ టీం సాయంతో నిందితుల ఆధారాలు సేకరించారు.

## అన్నదానం

**ప్రజాశక్తి- తవణంపల్లి :** తవణంపల్లి మండలం, గాజులపల్లెలో మహాభారత యజ్ఞం సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారత యజ్ఞంలో రాజసుయాగం , హరికథ ఘట్టాన్ని ఆయన ఆలకించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా అన్నదానం నిర్వహించి సుమారు వెయ్యి మందికి పైగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజసుయాగం వంటి ఘట్టాలు మనకు నీతి, ధర్మం, నాయకత్వం గురించి బోధిస్తాయన్నారు. గాజులపల్లిలో ఈ మహాభారత యజ్ఞం గ్రామానికి ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చింది. ఇలాంటి యజ్ఞాలు సమాజానికి ప్రయోజనకరమన్నారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, పార్టీ నాయకులు ప్రవీణ్ నాయుడు , మోహన్ నాయుడు, బంగారుపాలెం మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర నాయుడు, గోపి యాదవ్, రంజిత్ రెడ్డి, మహాభారత యజ్ఞం కమిటీ సభ్యులు లోకనాథ్ నాయుడు, మురళి, వేణు పలువురు మండల టిడిపి నాయకులు, పాల్గొన్నారు.

## స్వామిత్వ సర్వేతో గుర్తింపు హక్కు

**ప్రజాశక్తి-పెద్దపంజాణి:** రాష్ట్ర ప్రభుత్వం స్వా మిత్వం సర్వేతో ప్రజలకు వారి అనుభవంలో ఉన్న గ్రామ కంతాలు, మొదలగునవి ఈ సర్వే తో గుర్తింపు హక్కును పొందవచ్చని రాజు పల్లి పంచాయతీ కార్యదర్శి రిజ్వానా అన్నారు. ఆదివారం రాజుపల్లి పంచాయతీ కమ్మినయనపల్లి గ్రామంలో స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూసర్వే తరహాలో గ్రామ కంతాలు,ఇతర స్థలాల్లో నిర్మాణాలు, పశువుల శాలలను స్వామిత్వ సర్వే చేసి గుర్తించి హక్కు పత్రాలు మంజూరు చేయడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కృష్ణంరాజు, విలేజ్ సర్వేయర్ సురేష్, ఇంజి నీరింగ్ సహాయకులు శ్రీకాంత్,కార్యదర్శి జైకృష్ణ, నాయకులు భాను ప్రతాప్ రెడ్డి,మంజునాథ రెడ్డి, నాగరాజ్ యాదవ్, ప్రవీణ్ కుమార్, అమరనాథ్, హరి పాల్గొన్నారు.



## వాలీబాల్ ప్రథమ బహుమతి విజేత వికోట

**ప్రజాశక్తి -బంగారుపాలెం:** గ్రామోత్సవ వాలీబాల్ పోటీలో జిల్లా మొదటి స్థానాన్ని వీ కోట జట్టు కైవసం చేసుకుందని జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా అన్నారు. ఆదివారం ఉదయం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఈషా ఫౌండేషన్ గ్రామోత్సవ వాలీబాల్ పోటీలు ఈషా ఫౌండేషన్ సభ్యులు వినోద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా నుండి 26 జట్లు పాల్గొనగా మొదటి బహుమతి వీకోట జట్టు పదివేల రూపాయలు రెండవ బహుమతి గంగవరం 7వేల రూపాయలు మూడవ బహుమతి కార్వేటినగరం 5వేలు రూపాయలు, నాలుగవ బహుమతి బంగారుపాళ్యం 3వేలు రూపాయలు గెలుచుకున్నాయని మొదటి బహుమతి సాధించిన వీకోట జట్టు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి జట్టులో పాల్గొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ జాతీయ క్రీడాకారులు తులసి రెడ్డి, కోచ్ సుదర్శన నాయుడు, పలువురు వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## నవలలు ఆవిష్కరణ

**ప్రజాశక్తి - వెదురుకుప్పం:** మండలానికి చెందిన యువ రచయిత, అధ్యాపకులు పేట యుగంధర్ రాసిన బాల సాహిత్య నవల 'జాను అనే నేను నా స్నేహితురాళ్లు', తిరుపతి రచయిత ఆర్‌సి కృష్ణస్వామి రాజు రాసిన 'మునికిష్టడి మాణిక్యం' నవలలను తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి ఆదివారం ఆవిష్కరించారు. తానా మంచి పుస్తకం నిర్వహించిన నవలల పోటీలో ఈ రెండు నవలలూ బహుమతి పొందాయి. వీటిని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర వేద విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ పదేళ్ల పైబడిన పిల్లల కోసం రాసిన ఈ రెండు నవలలూ పిల్లల్లో పఠనా శక్తిని పెంచుతాయని, సమాజంపై అవగాహనను కలిగిస్తాయని పేర్కొన్నారు. ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఆచార్య పిసి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రచయిత వెదురుకుప్పం మండలం, చిన్నమ్మ రెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన వ్యక్తి పేట యుగంధర్ రాసిన 'జాను అనే నేను నా స్నేహితురాళ్లు' పుస్తకాన్ని సమీక్షించారు. ఇప్పటికీ సమాజం స్త్రీ పట్ల వివక్ష చూపుతోందని, తల్లి దండ్రులు సైతం తమ కడుపున పుట్టిన పిల్లలను భేద భావంతో చూస్తున్నారన్నారు. మగ పిల్లాడికి ఇచ్చినంత స్వేచ్ఛ ఆడ పిల్లకు ఇవ్వడం లేదని, పల్లెటూర్లలో ఈ భేదభావం మరింత ఎక్కువగా ఉందని వాపోయారు. మగ పిల్లాడిని ఉన్నత చదువులు చదివించే తల్లిదండ్రులు, ఆడపిల్లకు పెళ్లి చేసి పంపడం ద్వారా తమ బాధ్యత తీరిపోతుందని అనుకుంటు న్నారన్నారు. అలాంటి తల్లిదండ్రులకు, ఇలాంటి సమాజానికి ఈ పుస్తకం అవసరం ఎంతో వుందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గంగిశెట్టి శివకుమార్ మాట్లాడు తూ నవలలో జాను చూపిన తెగువ ప్రతి ఆడపిల్లలో ఉండాలని, అబ్బాయిలకు అమ్మాయిలు ఎంత మాత్రం తక్కువ కాదన్నారు. ఈ కార్యక్రమంలో రచయితలు జొన్న విత్తుల శ్రీరామచంద్రమూర్తి, ఆకుల మల్లేశ్వరరావు, కవి మేఘనాథ్ రెడ్డి, పల్లిపట్టు నాగరాజు, డాక్టర్ లక్ష్మీ ప్రియా పాల్గొన్నారు.


నవలలను ఆవిష్కరిస్తున్న సాహితీ ప్రముఖులు

## వర్గీకరణ పేరిట అనైక్యతకు కుట్ర

### మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :** ఎస్‌సి వర్గీకరణ పేరిట దళితుల ఐక్యతను దెబ్బ తీసేందుకు కుట్ర పన్నారని నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ రాక్స్ అండ్ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్ పేర్కొన్నారు. స్థానిక ఏపీడబ్ల్యూ జెఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ కుట్రలో చంద్రబాబు భాగస్వామిగా మారారని ఆరోపించారు. అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గంపై తెలుగు రాష్ట్రాల్లో కత్తిగట్టాయని వాపోయారు. జగన్‌మోహన్ రెడ్డి దీనిపై కనీసం నోరు మెదపకపోవడం దురదృష్టకరం అన్నారు. జగన్ ఈ నాటికి తన నిర్ణయం ఏమిటో చెప్పకపోవడం, అత్యంత బాధాకరం అన్నారు. కులాన్ని, మతాన్ని రెచ్చగొట్టి ఈ దేశాన్ని విభజించి, దేశాన్ని అమ్ముకునే పనిలో బిజెపి ఉందని ధ్వజమెత్తారు. రిజర్వేషన్ పేరుతో ఎస్సీలు కొట్టుకు చావండి అనే ఉద్దేశంతోనే ఎస్‌సి వర్గీకరణను తెర పైకి తెచ్చారన్నారు. ఎస్‌సి వర్గీకరణ తప్పు అని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సిందే అని డిమాండు చేశారు. సుప్రీం కోర్టు న్యాయ మూర్తులు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించే వరకూ ఈ నిరంతర పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు దేవా, ఉదయ్ కుమార్, సంతోష్ కుమార్, మహాసముద్రం కృష్ణ, బుల్లెట్ బాబు, పూతలపాటి ఏసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

## నృత్య పోటీల్లో అక్షర విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి- రామకుప్పం:** కళా తరంగిణి నృత్య పోటీల్లో రామకుప్పం దియా డాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో కుప్పం డిగ్రీ కాలేజ్‌లో ఆదివారం నిర్వహించిన నృత్య పోటీల్లో అక్షర పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభని చాటుకున్నారు. నిర్వాహకులు నగదు, ధ్రువపత్రాలు విద్యార్థు లకు అందించారు. పిల్లల తల్లిదండ్రులు డాన్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచినందుకు అక్షర స్కూల్ యాజమాన్యానికి, డిఆర్ డాన్స్ స్టూడియో వారికి కృతజ్ఞ తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డాన్స్ స్టూడియో దినేష్ బాబు, చందు, ఉదయ్, సుదర్శన్, పవన్, అక్షర స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



నృత్య పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు


భారీ వృక్షాలను కూల్చివేస్తున్న దృశ్యం

## యథేచ్ఛగా వృక్షాలు తొలగింపు

### వాతావరణ పరిస్థితులపై ఆందోళన

**ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి:** ప్రకృతిని కాపాడే వృక్షాలు భవిష్యత్తు తరాలకు ఆక్సిజన్ ఇచ్చే ప్రాణ వాయువులా నిలుస్తాయి. అయితే బైరెడ్డిపల్లి మండలంలో నిర్దాక్షిణ్యంగా చెట్లను నరికేస్తూ, వాతావరణ సమతుల్యతను భంగం కలిగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలంలోని అనేక రహదారుల పక్కలలో పాత పేట గ్రామంలో, ఎండిపోయిన, ఎప్పుడైనా కూలే ప్రమాదంలో ఉన్న చెట్లు వదిలేస్తున్నారు. వీటివల్ల వాహనదారులు, పాదచారులు ఎప్పటికప్పుడు భయాందోళన చెందుతున్నారు. పాతపేట సమీపంలో రెండు నేరేడు చెట్లు కూలడానికి సిద్ధంగా ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

అదే సమయంలో పచ్చగా పెరిగి వాతావరణాన్ని చల్లబరిచే ఏసీ లాంటి చెట్లను మాత్రం అనుమతులు ఉన్నా లేకపోయినా కొంతమంది నిర్దాక్షిణ్యంగా కోసేస్తున్నారు. వీటిని పక్క రాష్ట్రాలకు తరలిస్తుండటంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తీర్థం గ్రామపంచాయతీ కేంద్రంలోని పాత ఆరోగ్య కేంద్రం చుట్టూ ఉన్న పచ్చని చెట్లను ఆదివారం ఉదయం నరికి వేయడం స్థానికులను కలవరపరిచింది. ఈ చర్యపై అధికారులను ప్రశ్నించినా తాము ఎటువంటి సమాచారం ఇవ్వలేదని సంబంధిత సిబ్బంది తెలిపినట్లు గ్రామస్తులు చెప్పారు.

**ప్రజల వాదన**

'ఒక చెట్టు పెరగడానికి ఏళ్ల తరబడి సమయం పడుతుంది. కానీ దాన్ని కోయడానికి ఒక నిమిషమే చాలు.. గ్లోబల్ వార్మింగ్ పెరుగుతున్న తరుణంలో ఇలా పచ్చని చెట్లను నరికివేయడం మరింత ప్రమాదకరం' అని స్థానికులు మండిపడుతున్నారు.

**సూచన**



ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా ఎండి పోయిన, మోడు బారిన చెట్లను మాత్రమే గుర్తించి కటింగ్ ఆర్డర్లు ఇవ్వాలని, పచ్చగా వృద్ధి చెందుతున్న చెట్లను రక్షించడానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. సంబంధిత జిల్లా అధికారులు తక్షణమే దీనిపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## బొమ్మల తయారీలో అందెవేసిన చేయి

### - నాణ్యతే లక్ష్యం
### - కార్వేటినగరంలో ప్రసిద్ధి బొమ్మల కుమార్

**ప్రజాశక్తి-వెదురుకుప్పం:** బొమ్మల తయారీలో అతనిది అందెవేసిన చేయి.. అతని చేయి తాకితే ఎలాంటి నాణ్యత లేని బొమ్మనైనా సుందరంగా తీర్చి దిద్దు కుంటుంది. చూపరులను సైతం మంత్రముగ్ధుల్ని చేస్తుంది. అతనికి లాభాపేక్ష లేదు.. కొనుగోలు దారుల్లో నమ్మకం పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. చిన్న వయస్సులో కాలంతో పోటీపడ్డాడు. మెదడుకు పదును పెట్టాడు. వినూత్నంగా ఆలోచించాడు. కాలం పునాదులు వేసింది.. నిలబడ్డాడు. కొనుగోలు దారుల ఆదరణే అతని నైపుణ్యానికి కాణాచిగా నిలుస్తోంది.

చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం మండలం కొల్లగుంట పంచాయతీలో పవన్ కుమార్ సుమారు 20 సంవత్స రాలుగా వినాయక బొమ్మలను తయారుచేస్తున్నాడు. హోల్ సేల్ దారులకు విక్రయిస్తుంటాడు. ఇతని చేతిలో బొమ్మ పడిందంటే ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకుంటుందని కొనుగోలు దారులు అంటున్నారు. వినాయకుని బొమ్మలు వివిధ రూపాల్లో తయారుచేసి విక్రయిస్తుంటాడు. పవన్ కుమార్ 3 అడుగుల నుంచి 16 అడుగుల ఎత్తువరకు బొమ్మలను తయారు చేస్తాడు. సుమారు 150 బొమ్మలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపా రు. ఇందుకు సంబంధించి వాడే మెటీరియల్ మొత్తం నాణ్యతగా ఉం టుందని అతను చెబు తు న్నాడు. సంవత్సరం పొడవునా ఈ బొమ్మల తయారీలో నిమగ్నం అవుతాడు. ఇతని దగ్గర 5, 6 కుటుంబాల వారు పని చేస్తుంటారు. వారికి అన్ని తానే చూసు కుంటాడు. అందువల్లే చుట్టు గ్రామాలలో వినాయకుని బొమ్మలు తయారుచేసే బొమ్మల కుమార్ పేరు ప్రసిద్ధిగాంచింది. దీన్ని పరిశీలిస్తే అతను ఎంతగా క్వాలిటీలో రాజీ పోకుండా బొమ్మలు తయారు చేస్తాడో అర్థమవుతుంది. ఇతను తయారుచేసిన బొమ్మలను పక్క రాష్ట్రమైన బెంగుళూరు, తమిళనాడు రాష్ట్రాలలో నుంచి ఆంధ్రకు వచ్చి అధిక సంఖ్యలో కొనుగోలు చేసి తీసు కెళ తారు. అక్కడితో పోలిస్తే చాలా తక్కువ ధరలకు బొమ్మలు వస్తా యని కొనుగోలు దారు ల అభిప్రాయ పడు తున్నారు. అందుకే ఆంధ్ర కు వచ్చి పవన్ కుమార్ వద్ద సంవత్సరం ముందు ఆర్డర్ ఇచ్చి కొనుగోలు చేసి మరీ తీసు కెళతారు. దీంతో అతని నైపుణ్యా న్ని ఇట్టే అర్థం చేసుకోవచ్చు. సీజన్ ముగిసిన తర్వాత వచ్చిన కొద్దిపాటి ఆదాయం స్థానికు లకు, కుటుంబ సభ్యులకు, వివిధ కార్యక్రమాలకు ఉపయో గిస్తూ సమాజ సేవ చేస్తుంటా డు. పదిమందిలో గుర్తింపు పొందాడు.


అమ్మకానికి సిద్ధంగా ఉంచిన బొమ్మలు

**నాణ్యతే లక్ష్యం**



బొమ్మల తయారీలో నాణ్యమైన మెటీరియల్ ఉపయోగిస్తాను. పర్యావరణకు హాని చేయని కెమికల్స్ ఉపయోగిస్తాం. వినాయకుని బొమ్మల తయారీలో రాజీలేని పోరాటం చేస్తున్నాం..

-పవన్ కుమార్, కొల్లాగుంట గ్రామం, కార్వేటినగరం.

## వాల్మీకులు ఎస్‌టి రిజర్వేషన్ సాధనకు ఏకం కావాలి

**ప్రజాశక్తి-పెద్దపంజాణి:** ఆంధ్రప్రదేశ్‌లోని వాల్మీకి బోయ కులస్తులు ఏకతాటిపై నడవాలని వాల్మీకి సంఘ నాయకులు పిలుపు నిచ్చారు.ఆదివారం నియోజక వర్గంలోని పలువురు వాల్మీకి సంఘ నేతలు మండలంలోని రాయలపేట గ్రామ పంచాయతీ నడింపల్లి గ్రామంలో ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు నిర్వహించి వాల్మీకులు అన్ని గ్రామాల్లో వాల్మీకులను చైతన్య పరచడానికి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు.వాల్మీకి సంఘ నాయకు డు న్యాయవాది ఎల్ భాస్కర్ మాట్లాడుతూ వాల్మీకి, బోయలు ఒకే మాట, ఒకే బాట అనే నినాదంతో ముందుకు వెళితే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వాల్మీకులను ఎస్టీ జాబితాలో పొందుపరచుటకు అవకాశం ఉంటుందన్నారు. కొంతమంది మనలో మనకే చిచ్చులు పెట్టి వర్గాలుగా విభజించి వారి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో మండలం వాల్మీకి సంఘ అధ్యక్షులు మాడి శంకరప్ప, సింగిల్ విండో డైరెక్టర్ గంగప్ప,సుబ్రమణ్యం,మాజీ సర్పంచ్ చలపతి, నాగేశ్వరరావు,కొర్రపాటి చంద్ర,దొరస్వామి, వెంకట్ రెడ్డి, ప్రభాకర్, గుర్రప్ప, రొంటకుంట్ల నర్సింహులు, మునస్వామి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

**ప్రజాశక్తి -వి కోట :** త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక వి కోట కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని రామాపురంలో శ్రీ కృష్ణ ప్రతిమ ఊరేగింపుతో కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం ముగిశాయి. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి , హిందూ జ్ఞాన వేదిక వి కోట కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణుడి ప్రతిమను వి కోట మండలంలోని రామాపురంలో గంగమ్మ గుడి పక్కన వేదిక నిర్మించి కొలువు తీర్చి, స్వామికి ప్రతి రోజు ఉదయం సాయంత్రం పూజలు చేస్తున్నారు. శ్రీకృష్ణ ప్రతిమ గ్రామంలో ఊరేగింపుతో కృష్ణాష్టమి వేడుకలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి చంద్ర శేఖర్, ఎంపిడిఓ రాధాకృష్ణ, మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు పాల్గొన్నారు.